క్లుప్తంగా

ముగిసిన ఫార్మేటివ్‌-3 పరీక్షలు

కంబాలచెరువు: నాలుగు రోజులుగా నగరంలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో సీబీఏ విధానంలో జరుగుతున్న ఫార్మేటివ్‌-3 పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్టు అర్బన్‌ రేంజ్‌ డీఐ బి.దిలీప్‌ కుమార్‌ శనివారం తెలిపారు. ఒకటి నుంచి 8 తరగతుల విద్యార్థులు జవాబులను ఓఎంఆర్‌ షీట్లలో పూర్తి చేశారన్నారు. ప్రధానోపాధ్యాయులు ఆ ఓఎంఆర్‌ షీట్లను తరగతి వారీగా ప్యాకింగ్‌ చేసి ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాలలోని స్టోరేజ్‌ పాయింట్‌కు అందజేశామన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు జయంతి శాస్త్రి, పబ్బినీడి ప్రసాద్‌ పాల్గొన్నారు.

14న మోటారుసైకిళ్ల వేలం

ధవళేశ్వరం: స్థానిక పోలీస్‌స్టేషన్‌ పరిధిలో వివిధ నేరాల్లో పట్టుకున్న మూడు మోటారుసైకిళ్లను ఈ నెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్‌ సూపరింటెండెంట్‌ కార్యాలయం వద్ద బహిరంగ వేలం వేయనున్నట్టు ధవళేశ్వరం సీఐ కె.మంగాదేవి తెలిపారు. తొలుత 16వ తేదీన వేయనున్నట్టు ప్రకటించామని మారిన తేదీని గమనించాలని విజ్ఞప్తి చేశారు.

పాఠశాల పరిశీలన



నారాయణపురం పాఠశాలను పరిశీలిస్తున్న డీఐ దిలీప్‌కుమార్‌

కంబాలచెరువు: స్థానిక నారాయణపురం నగర పాలక సంస్థ ప్రాథమిక పాఠశాలను శనివారం అర్బన్‌ రేంజ్‌ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌ ఆఫ్‌ స్కూల్స్‌ బి.దిలీప్‌కుమార్‌ సందర్శించారు. రికార్డులన్నీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఎప్పటికప్పుడు రికార్డులన్నీ అప్‌డేట్‌ చేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ప్రతి ఉపాధ్యాయుడు విధిగా లెసన్‌ ప్లాన్‌, డైరీతో పాఠాన్ని బోధించాలన్నారు. విద్యార్థులకు ఇచ్చే నోట్స్‌లను ఎప్పటికప్పుడు దిద్ది, తప్పును విద్యార్థికి తెలియజేయాలన్నారు. ఫార్మేటివ్‌-3 పరీక్షలు పూర్తయ్యాయని, 14 వ తేదీలోపున ఆన్‌లైన్‌లో మార్కులు పెడతారన్నారు. అర్బన్‌ లోని అన్ని పాఠశాలలో తమ తమ రికార్డులను అప్‌డేట్‌ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ కోటేశ్వరి, జె.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయిని ఎస్‌.పార్వతి, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌, సునీల్‌, గంగా భవాని, కాంతి కుమారి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూ కుంభకోణాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి

సీటీఆర్‌ఐ: పోలవరం భూ కుంభకోణాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్‌ చేశారు. దేవీపట్నం తహసీల్దార్‌గా పనిచేసిన కె.సురేష్‌ బాబును ఇండియా రప్పించి విచారణ జరిపించాలని, అప్పటి సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ ఆర్‌.వెంకటరత్నంపైనా విచారణ జరిపించాలని డిమాండ్‌ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవీపట్నం మండలంలో భూమి రికార్డులను వెబ్‌ ల్యాండ్‌లో అక్రమంగా మార్పేసిన వ్యవహారంలో తహసీల్దార్‌ కె.సురేష్‌ బాబుపై ఎఫ్‌ఐఆర్‌ నంబర్‌ 7గా 2019 ఫిబ్రవరి 8న కేసు నమోదయ్యిందన్నారు. అయినా ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. వీటిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలన్నారు.

రాహుల్‌ సందేశాన్ని ప్రతి ఇంటికి చేరుస్తాం



జోడో ప్రచార యాత్రను ప్రారంభిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు దేశాన్ని ఐక్యంగా చేయాలని, లౌకికత్వాన్ని నాశనం చేయాలని ప్రయత్నిస్తున్న బీజేపీ విధానాలను వ్యతిరేకిస్తూ చేపట్టిన భారత్‌ జోడో యాత్ర సందేశాన్ని రాష్ట్రంలో ప్రతి ఇంటికీ చేరవేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేస్తాయని కాంగ్రెసు నాయకులు అన్నారు. స్థానిక కృష్ణ నగర్‌లో ఉన్న కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయం వద్ద తూర్పు గోదావరి జిల్లాలో తిరిగే భారత్‌ జోడో ప్రచార రథాన్ని జిల్లా కాంగ్రెస్‌ అధ్యక్షుడు మార్టిన్‌ లూథర్‌, నగర కాంగ్రెస్‌ అధ్యక్షుడు, రూరల్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి బాలేపల్లి మురళీధర్‌ ఆధ్వర్యంలో అనపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్‌ వడయార్‌ జెండా ఊపి ప్రారంభించారు. రాహుల్‌ కన్యాకుమారి నుంచి కాశ్మీర్‌ వరకు చేసిన 4 వేల కిలోమీటర్ల పాదయాత్రకు మద్దతుగా నగరంలో పాదయాత్రలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముళ్ల మాధవ్‌, బిడవాడ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు ఒరిగేదేమీలేదు

సీటీఆర్‌ఐ: నాలుగేళ్ల వైఎస్సార్‌ సీపీ పాలనలో ముస్లింలకు ఒరిగిందేమీలేదని టీడీపీ ముస్లిం నాయకులు విమర్శించారు. శనివారం టీడీపీ మైనార్టీ సెల్‌ నాయకులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో మైనారిటీలను పట్టించుకోలేదని వైఎస్సార్‌ సీపీ మైనారిటీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారం హాఫ్‌ నాలెడ్జ్‌తో చేస్తున్నవేనని కొట్టిపారేశారు. చంద్రబాబు నాయుడు చేస్తున్న ఇదేం కర్మ మన రాష్ట్రానికి పర్యటనలు, లోకేష్‌ పాదయాత్రకు వస్తున్న ప్రజాస్పందన వస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బషీర్‌, రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.

పందుల స్వైర విహారం

- నగరం, శివారులో పరిస్థితి దారుణం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- ఆదేశాలిచ్చినా పట్టించుకోని పందుల పెంపకందారులు



అల్కాట్‌ తోట గోదావరి గట్టు వద్ద పందుల సంచారం

సీటీఆర్‌ఐ: నగరంలో పందుల స్వైర విహారం ఎక్కువైంది. పందుల పెంపకందారులు ఉదయం పూట వాటిని విడిచిపెట్టడంతో గుంపులుగా వీధిల్లో తిరుగుతున్నాయి. వీధిలో ఇప్పటికే కుక్కల బెడదతో బెంబేలెత్తున్న జనం వాటికి తోడు పందులు కూడా ఉండడంతో దిక్కు తోచని పరిస్థితి వచ్చింది. పందులు గుంపులుగా రోడ్డుల మీదకి రాగానే కుక్కలు వాటిని తరుముకుంటూ వస్తున్నాయి. దీంతో అవి దగ్గరల్లో ఉన్న ఇళ్లలోకి చొరబడి రచ్చ రచ్చ చేస్తున్నాయి. నగరంలో 52 మంది పందుల పెంపకం దారులున్నారు. వీరందరికీ గతంలోనే కొండగుంటూరు వద్ద రెండు ఎకరాలు స్థలం కేటాయించారు. అయినా అక్కడ సౌకర్యాలు లేవనే సాకుతో వెళ్లడంలేదు.

నగర శివారులో పరిస్థితి మరీ దారుణం

నగర శివారులైన సుబ్బారావు నగర్‌, భాస్కర్‌ నగర్‌, క్వారీ మార్కెట్‌, చోడేశ్వర నగర్‌, లాలాచెరువు, ఆనందనగర్‌, పుంత రోడ్డు, సుబ్రహ్మణ్య నగర్‌, ఎస్‌బీఐ కాలనీ, వెంకటేశ్వరరావు నగర్‌, మల్లికార్జున నగర్‌, 45వ డివిజన్‌లోని వాంబే గృహాల వద్ద, లూథర్‌గిరి, పీఅండ్‌టీ కాలనీ, మున్సిపల్‌ కాలనీ, కోటిలింగాల పేట, జాంపేట తదితర ప్రాంతాలలో పందుల ఎక్కువగా తిరుగుతున్నాయి. పందుల పెంపకందారులకు జంగాల కాలనీ, చెంచుకాలనీ దాటిని తరువాత వారు నివాసం ఉండటానికి స్థలాలు కూడా కేటాయించారు. కానీ జంగాల కాలనీ వరకూ సిటీ పెరగడంతో పందుల గోల మళ్లీ మొదటికి వచ్చింది. శివారు ప్రాంతాలే కాకుండా ఇప్పుడు సిటీలో కూడా పందుల సంచారం పెరిగింది. ఏకేసీ కాలేజీ, తిలక్‌ రోడ్డు, దానవాయిపేట, సెయింట్‌పాల్స్‌ చర్చ్‌, సుబ్రహ్మణ్యం నగరం, వేంకటేశ్వర నగర్‌, ఆదెమ్మదిబ్బ, పేపర్‌మిల్లు సెంటర్‌, లూథరన్‌ చర్చి ప్రాంగణం, లాలాచెరువు వంటి తదితర ప్రాంతాలలో పందులు సంచారం ఎక్కువగా ఉంది.

గతంలోనే చర్చలు జరిగినా...

రూరల్‌ ప్రాంతానికి వెళతామని పందుల పెంపకం దారులు కమిషనర్‌తో చర్చించిన తరువాత చెప్పడంతో వారికి కొంత సమయం కేటాయించారు. కానీ సమయం ముగిసిన తరువాత కూడా వారు వెళ్లకపోవడంతో పందులను రోడ్లపైకి వదులుతున్నారు. దీని వల్ల ఫైలేరియా, మలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. కొద్ది రోజుల క్రితం చెన్నై నుంచి పందులు పట్టే వారిని పిలిపించి వాటిని ఇక్కడ నుంచి తరలించడంతో పందులు పెంపకందారులు ఎదురు తిరిగారు. చెన్నై నుంచి వచ్చిన పందులు పట్టుకునే వారిపై దాడి కూడా చేయడంతో ఈ పనిని కార్పొరేషన్‌ వారు విరమించుకున్నారు. కొద్ది రోజులు పందులను వీధులలోకి వదలకుండా కట్టడి చేసిన పెంపకందారులు ఇప్పుడు మళ్లీ పందులను వదలిపెడుతున్నారు. దీనితో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

వారు అక్కడికి వెళ్లకపోవడంతో..



పందుల పెంపకం యాజమానులకు రాజమహేంద్రవరం రూరల్‌ పరిధిలోని కొండగుంటూరులో రెండు ఎకరాల స్థలం కేటాయించారు. కాని వారు అక్కడికి వెళ్లకుండా సింహాచలం నగర్‌ దగ్గరల్లో నివాసం ఉంటున్నారు. క్వారీ ప్రాంతానికి కాస్తా దూరంలో ఉండడంతో ఉదయం పూట పందలు గుంపులుగా రోడ్డు మీదుకు వస్తున్నాయి. ఇప్పుడు ఎకంగా సిటీలోకి కూడా వస్తున్నాయి. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పందులను అరికట్టాలి.

– దొమ్మేటి స్వర్ణకుమార్‌, స్థానికుడు

కంపు భరించలేకపోతున్నాం



కార్పొరేషన్‌ అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి. పందులు వల్ల వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. పారిశుద్ధ్య కార్మికులు ఉదయం వచ్చి చెత్త తీసుకుని వెళ్లుతున్నారు. మళ్లీ తిరిగి మరసటి రోజు వరకు రావడం లేదు. దీనితో పందులు చెత్త ఉన్నచోటకి చేరి చిందరవందర చేస్తున్నాయి. దీనితో కంపుని భరించలేకపోతున్నాం.

– కార్తిక్‌ శింగంపల్లి, సామాజికవేత్త

హెచ్‌ఆర్‌పీసీఐ కన్స్యూమర్‌ స్టేట్‌ చైర్మన్‌గా రాజేశ్వరరావు

ప్రకాశం నగర్‌ : హ్యూమన్‌ రైట్స్‌ ప్రొటెక్షన్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ ఇండియా కన్స్యూమర్స్‌ రైట్స్‌ ప్రొటెక్షన్‌ సెల్‌ ఏపీ స్టేట్‌ చైర్మన్‌గా ప్రముఖ న్యాయవాది దండు ప్రోలు సుబ్రహ్మణ్య రాజేశ్వరరావు నియమితులయ్యారు. ఈ విషయం ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ నేషనల్‌ చైర్మన్‌ తాళ్లూరి ప్రసన్నకుమార్‌ నుంచి నియామక ఉత్తర్వులు అందినట్టు తెలిపారు.

సెంట్రల్‌ జైలులో వైద్య శిబిరం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక అల్లు రామలింగయ్య ప్రభుత్వ హోమియోపతి వైద్య కళాశాల బృందం కేంద్ర కారాగారంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఖైదీలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వివిధ రుగ్మతలతో బాధపడుతున్న 200 మందికి డాక్టర్‌ పీవీ హరినాథ్‌, డాక్టర్‌ జ్యోతి, డాక్టర్‌ కె.శ్రీనివాసు పరీక్షలు చేశారు. పౌష్టికాహారం, వ్యయామం చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కేంద్రకారాగార జైలు సూపరింటెండెంట్‌ ఎస్‌.రాజారావు, ఉప పర్యవేక్షణాధికారులు ఎం.రాజకుమార్‌, ఎస్‌.కమలాకర్‌, కారాగార వైద్యాధికారి పీతాని కోమల, కె.దుర్గా రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్‌ కాలనీలో...

ప్రకాశం నగర్‌ : అదొనై ఇంటర్నేషనల్‌ మినిస్ట్రీస్‌ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మున్సిపాల్‌ కాలనీలో ఉచిత మెడికల్‌ క్యాంపు నిర్వహించారు. డాక్టర్‌ బి.విద్యాసాగర్‌, డాక్టర్‌ సీహెచ్‌ సూజన్‌, డాక్టర్‌ అంద్రూ తాళ్ళూరి 200 మందికి పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు.

సమస్యలు విన్నవించిన ఆటో యూనియన్‌ నేతలు



ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ను కలిసి సమస్యలు విన్నవిస్తున్న ఆటోయూనియన్‌ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్‌: ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ పార్లమెంటరీ చీఫ్‌ విప్‌, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌ రామ్‌కు కోటిపల్లి బస్టాండు మదర్‌ థెరీసా ఆటో యూనియన్‌ నాయకులు అభ్యర్థించారు. యూనియన్‌ గౌరవ అధ్యక్షుడు ఎన్వీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం నగరంలోని వీఎల్‌ పురం మార్గాని ఎస్టేట్స్‌ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయానికి వెళ్లి ఎంపీ భరత్‌ను కలిశారు. తమ సమస్యలను తెలియజేస్తూ వినతిపత్రం అందజేశారు. యూనియన్‌ ప్రతినిధులకు ఎంపీ భరత్‌, యూనియన్‌ గౌరవాధ్యక్షుడు ఎన్వీ శ్రీనివాసరావు పూలమాలలు వేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మదర్‌ థెరీసా ఆటో యూనియన్‌ గౌరవ సలహాదారు దాసరి ప్రసాద్‌, అధ్యక్షుడు కొర్ని సూర్య, ఉపాధ్యక్షుడు వైవీ విజయ్‌ కుమార్‌, కార్యదర్శి పి.వెంకటరమణ, సహాయ కార్యదర్శి కె.వరప్రసాద్‌, కోశాధికారి సీహెచ్‌ సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

ప్రకాశం నగర్‌ : విద్యుత్‌ లైన్ల మరమ్మతుల పనుల నిమిత్తం ఆదివారం మార్కెట్‌యార్డ్‌ విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని జయ కృష్ణాపురం, వీరభద్రపురం, ఇన్‌కమ్‌ టాక్స్‌ ఆఫీస్‌ ప్రాంతం, కొరుకొండ రోడ్డు, ఆదెమ్మ దిబ్బ, హరిపురం, సుబ్బారాయపురం, లలిత నగర్‌, విద్యానగర్‌, పీఅండ్‌ టీ కాలనీ, సుభాష్‌ నగర్‌ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్‌ సరఫరాను నిలిపివేయనున్నట్టు ఏఈ శామ్యూల్‌ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఘంటసాలకు ఘన నివాళి



ఘంటసాల చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న నల్లరాజు తదితరులు

కడియం: తన మధురమైన గాత్రంతో కోట్లాది మంది ప్రజలను అలరించిన ఘనత ఘంటసాలకు దక్కుతుందని పలువురు పేర్కొన్నారు. ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకుని వేమగిరిలోని ఆయన అభిమాని ప్రత్తిపాటి నల్లరాజు ఆధ్వర్యంలో ఘంటసాల చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. వేమగిరి జాతీయ రహదారి ఆటోస్టాండ్‌ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొత్తూరి బాలనాగేశ్వరరావు, మద్రి సుబ్రహ్మణ్యం, పల్లపురాజు, సాయిరాం ఆటో వర్కర్స్‌ యూనియన్‌ నాయకులు పాల్గొన్నారు.

ధవళేశ్వరంలో...



ఘంటసాల విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న అసోసియేషన్‌ సభ్యులు

ధవళేశ్వరం: పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా గోదావరి కల్చరల్‌ అసోసియేషన్‌ సభ్యులు ధవళేశ్వరంలో శనివారం ఘంటసాల విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్‌ ఉపాధ్యక్షుడు గ్రంధి జగన్నాథం, సావాడ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఘంటసాల తెలుగు సంగీతానికి, సినిమా పాటలకు ప్రపంచ ఖ్యాతి తీసుకువచ్చారని కొనియాడారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు రామహేంద్రవరం విక్రమ్‌ హాల్లో రాకా, గోదావరి కల్చరల్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో సంగీత విభావరి ఏర్పాటు చేశామని ఘంటసాల, సంగీతం, సినీ అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని అధ్యక్షుడు రాకా రమణ కోరారు. అసోసియేషన్‌ సభ్యులు పుసులూరి ఫణిశేషుకుమార్‌, మూడెడ్ల రమేష్‌, గాదిరాజు రామరాజు, గుడిమెట్ల కలికి రెడ్డి పాల్గొన్నారు.

వివాహ వేడుకలో ఎమ్మెల్యే రాజా



రాజమహేంద్రవరంలో చెరుకూరి వీర్రాజు సుబ్బలక్ష్మీ గార్డెన్స్‌లో శనివారం జరిగిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్‌ చైర్మన్‌ విప్పర్తి వేణుగోపాలరావు, అంజలి దంపతుల కుమారుడు నిఖిల్‌కృష్ణ వివాహానికి నాయకులు, ప్రముఖులందరూ హాజరయ్యారు. మంత్రి వేణు గోపాలకృష్ణ, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కార్యక్రమంలో పాల్గొని నవదంపతులను ఆశీర్వదించారు.

– రాజమహేంద్రవరం రూరల్‌

ఎంపీ భరత్‌ను కలిసిన ఆచంట అనసూయ



ఎంపీ భరత్‌రామ్‌ను సత్కరించి వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని అందజేస్తున్న ఆచంట అనసూయ

రాజమహేంద్రవరం రూరల్‌: భగవంతునికి సేవ చేసుకునే అదృష్టం రావడానికి పూర్వజన్మ సుకృతం ఉండాలని, అటువంటి భాగ్యం వచ్చిన మీరు అదృష్టవంతులని ద్వారకా తిరుమల ట్రస్టు బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన ఆచంట అనసూయను ఉద్దేశించి ఎంపీ మార్గాని భరత్‌ రామ్‌ అన్నారు. ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ పాలకమండలి సభ్యులుగా నియమితులైన గోపాలపురం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు ఆచంట అనసూయ శనివారం వీఎల్‌ పురం మార్గాని ఎస్టేట్స్‌ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయానికి వచ్చి ఎంపీ భరత్‌ రామ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తనను ఈ పదవిలో నియమించడంపై ఎంపీ భరత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌ మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యాలకు, వారి సమస్యలు పరిష్కారానికి తగిన కృషి చేయాలని అనసూయకు సూచించారు.

స్నాన ఘట్టాలు శుభ్రం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ : ఈ నెల 18వ తేదీన జరిగే మహాశివరాత్రి పర్వదినం నిమిత్తం వివిధ ప్రాంతాల నుంచి రాజమహేంద్రవరానికి వచ్చే యాత్రికులకు స్నాన ఘట్టాలలో సౌకర్యాలు కల్పించాలని, ఆడవారికి దుస్తులు మార్చుకోవడానికి గదులను ఏర్పాటు చేయాలని గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అధికారులను కోరారు. శనివారం స్థానిక పేపర్‌ మిల్లు ఎదురుగా ఉన్న శ్రీకృష్ణ సాయి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పుణ్య స్నానాలు ఆచరించే భక్తులకు గోదావరి రేవులలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని ఆయన ఆక్షేపించారు. ఈ విషయమై కార్పొరేషన్‌ను కోరగా వారు మూడు రోజుల సమయం అడిగారని, అందువల్ల ఆ సమయం లోపు పారిశుధ్యాన్ని మెరుగు పరచకుంటే, తామే స్వచ్ఛందంగా తమ సమితి ఆధ్వర్యంలో నడుం బిగించి, వివిధ కళాశాలల విద్యార్థులతో కలిసి స్నాన ఘట్టాలను పరిశుభ్రం చేస్తామని తెలిపారు. విలేకరుల సమావేశంలో గోదావరి పరిరక్షణ సమితి సభ్యులు పినిశెట్టి సుబ్బరాజు, ఎస్‌.వి.వి.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

13న ప్రధానమంత్రి నేషనల్‌ అప్రెంటిస్‌ మేళా

రాజమహేంద్రవరం రూరల్‌: కాకినాడ, డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాలోని ప్రముఖ కంపెనీలలో వివిధ ట్రేడ్‌ల్లో అప్రెంటీస్‌ ఖాళీలను భర్తీ చేసేందుకు ధవళేశ్వరం ప్రభుత్వ ఐటీఐలో ప్రధానమంత్రి నేషనల్‌ అప్రెంటిస్‌ మేళా సోమవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్‌, జిల్లా కన్వీనర్‌ జీ.వి.రమణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళా ద్వారా ప్రముఖ కంపెనీలు సుమారు 200 ఖాళీలు భర్తీ చేయనున్నారు. తాళ్లపూడి టాగూర్‌ ల్యాబోరేటరీస్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌లో ఎలక్ట్రీషియన్‌, ఫిట్టర్‌, పెయింటర్‌, బాయిలర్‌ ఆపరేటర్‌, డ్రాఫ్ట్‌ స్మెన్‌ సివిల్‌ ట్రేడ్‌ల్లోలో సుమారు 150 ఖాళీలను భర్తీచేయనున్నారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.8 వేల స్టైఫండ్‌, భోజన, రవాణా సౌకర్యం కల్పించనున్నారు. శిక్షణ కాలం పూర్తయిన తరువాత కంపెనీలో ఉద్యోగావకాశం ఉంటుందని తెలిపారు. ఉద్యోగకాలంలో జీతంతో పాటు, రవాణా సౌకర్యం, క్యాంటీన్‌ వసతి, బోనస్‌, ఇన్సెంటివ్‌ కూడా ఇస్తారన్నారు. ఇతర ప్రముఖ కంపెనీలలో కూడా అప్రెంటీస్‌షిప్‌ ట్రైనింగ్‌ కల్పిస్తారని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలో వివిధ ట్రేడ్‌ల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ అప్రెంటీస్‌ ప్రొఫైల్‌తో పాటు ఒక జత జిరాక్స్‌ కాపీలతో హాజరుకావాలన్నారు. మేళాకు హాజరయ్యే వారు ముందుగా అప్రెంటీస్‌ ఐబీఎం పోర్టల్‌ httpr://dft.gov.in/apmea 2022లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 96765 60002, 9848738841 నంబర్లకు సంప్రదించాలని జిల్లా కన్వీనర్‌, ప్రిన్సిపాల్‌ జీ.వి.రమణరావు కోరారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



సమావేశంలో మాట్లాడుతున్న ఖురేషి తదితరులు

సీటీఆర్‌ఐ: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం పక్షపాతి అని మరోసారి నిరూపించుకున్నారని ఏపీ స్టేట్‌ హజ్‌ కమిటీ డైరెక్టర్‌ ఇబాదుల్ల ఖరేషి అన్నారు. శనివారం స్థానిక లాలాచెరువు వద్ద ఉన్న హజ్‌ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడ్డాక హజ్‌ యాత్రికుల సౌకర్యార్థం ఎంబార్కేషన్‌ పాయింట్‌ని విజయవాడకి రావడానికి కృషి చేసిన సీఎం జగన్‌కి కృతజ్ఞతులు తెలియజేస్తున్నామన్నారు. సీఎం జగన్‌ కృషితో ఈ సారి రాష్ట్రంలోని హాజీలు విజయవాడ విమానాశ్రయం నుంచి బయలుదేరడం ప్రారంభమవుతుందన్నారు. సౌదీ ప్రభుత్వం, కేంద్ర హజ్‌ కమిటీ ఈసారి హజ్‌ యాత్ర షెడ్యుల్‌ను ప్రకటించిందన్నారు. హజ్‌ 2023 యాత్రకు దరఖాస్తులు ఈనెల 10వ తేదీ నుంచి ప్రారంభమై మార్చి 10వ తేదీ వరకు తీసుకునే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. హజ్‌ 2023 యాత్రలో పాల్గొనాలనుకునే వారికి డిసెంబరు 31, 2023 వరకు చెల్లుబాటులో ఉన్న పాసుపోర్టు ఉండాలన్నారు. గుర్తింపు పొందిన కోవిడ్‌ వ్యాక్సినేషన్‌ చేయించుకుని ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నయీమ్‌, నిజాం, మున్నా, నజిబుల్లా తదితరులు పాల్గొన్నారు.

కళాతపస్వి విశ్వనాథ్‌కి స్వర నివాళి



స్వరనీరాజనం కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్‌

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్‌): కళాతపస్వి కె.విశ్వనాథ్‌కి నట గాయకుడు శ్రీపాద జిత్‌ మోహన్‌ మిత్ర బృందం స్వరనీరాజనం సమర్పించింది. స్థానిక వై.జంక్షన్‌ ఆనం రోటరీ హాలులో శనివారం రాత్రి నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాతపస్వి విశ్వనాథ్‌ సినిమాల్లోని మధుర గీతాలతో కూడిన డాక్యుమెంటరీని స్క్రీన్‌ పై ప్రదర్శించారు. నంది అవార్డు గ్రహీత డాక్టర్‌ ఎస్వీ రామారావు వ్యాఖ్యానంతో సాగిన ఈ కార్యక్రమం ఆద్యంతం సంగీత ప్రియులను అలరించింది. రోటేరియన్‌ పట్టపగలు వెంకట్రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌ కుమార్‌, అల్లు బాబి, ఎండీ ఖాదర్‌ ఖాన్‌ అతిథులుగా పాల్గొని విశ్వనాథ్‌తో అనుబంధం గుర్తు చేసుకున్నారు. విశ్వనాథ్‌తో జిత్‌ మోహన్‌ మిత్రకి గల అనుబంధాన్ని వివరించారు. మాజీ ఎంపీ ఉండవల్లి మాట్లాడుతూ విశ్వనాథ్‌కి అన్ని విషయాలపై సమగ్ర అవగాహన ఉందని అందుకే ఆయన సినిమాలు పెద్ద హీరో లేకపోయినా భారీ బడ్జెట్‌ కాకపోయినా ఘన విజయం సాధించాయని అందుకు శంకరాభరణం లాంటి సినిమాలు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రెసిడెంట్‌ పేరమ్మ చిత్రం చూస్తే, రాజకీయాలపై కూడా విశ్వనాథ్‌కి సమగ్ర అవగాహన ఉన్నట్లు అర్థమవుతుందన్నారు. అశోక్‌ కుమార్‌ జైన్‌, పీవీఎస్‌ కృష్ణారావు, దేశిరెడ్డి బలరామనాయుడు, డాక్టర్‌ గిరజాల సోమరాజు నాయుడు, వి.జగపతి, సూజిళ్ళ సూరి బాబు, డి.ఎస్‌. శ్రీనివాస్‌, టి.శ్రీనివాసరావు, గుంటూరి శ్రీనివాస్‌, బొట్ల సురేష్‌, ఎర్రాప్రగడ ప్రసాద్‌, బి.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిని బలిగొన్న కంటైనర్‌

రాజానగరం: బిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గుర్తు తెలియని వృద్ధురాలిని(60) కంటైనర్‌ కబలించింది. దివాన్‌చెరువు పెట్రోలు బంకు దాటిన తరువాత గైట్‌ కళాశాల వైపు నడిచివెళుతున్న ఆమెను వేగంగా వెళ్తున్న వాహనం బలంగా ఢీ కొని దూసుకుపోవడంతో ప్రాణాలు కోల్పోయింది. గురువారం రాత్రి సమయంలో జరిగిన ఈ సంఘటన పై బొమ్మూరు పోలీసులను వివరణ కోరగా ప్రమాదానికి కారణమైన కంటైనర్‌ డ్రైవర్‌ని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వీఆర్‌వోల సంఘం నూతన కమిటీ ఎన్నిక



గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నూతన కార్యవర్గం

రాజమహేంద్రవరం రూరల్‌: రాజమహేంద్రవరం డివిజన్‌ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నూతన కమిటీని శనివారం రాజవోలు గ్రామంలోని జక్కంపూడి రామ్మోహనరావు కమ్యూనిటీ హాల్లో జిల్లా అధ్యక్షుడు కె.సూర్యనారాయణ అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎ.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా ఓ.శ్రీనివాసరావు, కె.రవి కుమార్‌, బి.విజయదుర్గ, ప్రధానకార్యదర్శిగా సీహెచ్‌ ఆదినారాయణ, కోశాధికారిగా కె.సుబ్బారావు, సంయుక్త కార్యదర్శిలుగా వై.వినాయకుడు, డి.శశికళ, ప్రచారకార్యదర్శిగా ఎం.శ్రీనివాస్‌, ఆర్గనైజింగ్‌ కార్యదర్శిగా ఎ.శివకృష్ణ, ఈసీ మెంబర్లగా జైనీసాహెబ్‌, వి.వెంకట్‌,కె.నాగేశ్వరరావు, జి.గంగరాజు, ఎం.రామారావులను ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా మహమ్మద్‌రజా, ప్రధానకార్యదర్శి సోమరాజు, డివిజన్‌ పరిధిలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

కంప్యూటర్‌ కోడింగ్‌లో ముగిసిన శిక్షణ

రాజానగరం: విద్యార్థులకు కంప్యూటర్‌ పరిజ్ఞానంపై అవగాహన పెంచుకునేందుకు ఇటువంటి శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయని ఆదికవి నన్నయ యూనివర్సిటీ తెలుగు అధ్యాపకులు ఆచార్య తలారి వాసు అన్నారు. దివాన్‌చెరువులోని డాక్టర్‌ వినయ్‌ సుంకర ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో కంప్యూటర్‌ 'సి' కోడింగ్‌లో విద్యార్థులకు ఇస్తున్న ఉచిత శిక్షణ తరగతులు ముగిశాయి. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన ముగింపు సమావేశంలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్‌ చైర్మన్‌ సుంకర వెంకటేశ్వరరావు, సభ్యులు సుంకర నాగేశ్వరరావు, సుంకర వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

లోక్‌ అదాలత్‌లో 733 కేసుల పరిష్కారం

అనపర్తి: స్థానిక జూనియర్‌ సివిల్‌ జడ్జి కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన లోక్‌ అదాలత్‌లో 733 కేసులు పరిష్కారమైనట్లు లోక్‌ అదాలత్‌ అసిస్టెంట్‌ శ్రీనివాసరావు తెలిపారు. న్యాయమూర్తి పి.చైతన్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 7 సివిల్‌, 691 క్రిమినల్‌, 28 ఎన్‌ఐ యాక్ట్‌ కేసులు, 6 ఈపీ కేసులు, డీవీసీ కేసు ఒకటి పరిష్కారమైనట్లు వివరించారు.

వ్యాన్‌ఢీ కొని మహిళ మృతి

రాజానగరం: జి.యర్రంపాలెంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందింది. ఈ సంఘటనకు సంబంధించిన సీఐ కాశీవిశ్వనాథ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మోరంపూడిలో ఉంటున్న స్వయంవరపు రాణి(35), ఆమె భర్త రమణ కేశవరం రోడ్డులో ఉన్న ఇటుక బట్టీలో పనిచేస్తు జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో వారువురూ బట్టీలో రోజువారీ పని ముగించుకుని తమ మోటారుసైకిల్‌పై ఇంటికి వస్తుండగా జి.యర్రంపాలెం వచ్చే సరికి ఎదురుగా వస్తున్న నర్సరీ వ్యాన్‌ (బొలేరా) ఢీకొంది. ఈ సంఘటనలో మోటారుసైకిల్‌పై వెనుక కూర్చున్న రాణి అక్కడికక్కడే మృతి చెందగా, రమణ గాయాలతో బయటపడ్డాడు. ఢీ కొట్టిన వ్యాన్‌ ఆమె తలను ఛిద్రం చేయడంతో కళ్లెదుటనే చనిపోయిన భార్య మృతితో రమణ విలవిల్లాడిపోయాడు. గాయాలతో ఉన్న అతని రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.